# పదకుండవ పాఠం

# الدرس الحادي عشر

## అల్లాహ్ పై విశ్వాసం

## الإيمان بالله

అంటేః ఉలూహియత్, రుబూబియత్ మరియు అస్మా వ సిఫాత్ లో అల్లాహ్ అద్వితీయుడని విశ్వసించాలి. (మొదటి పాఠంలో దీని వివరాలు చూడవచ్చును). క్రింద తెలుపబడే నాలుగు విషయాలను నమ్మడం తప్పనిసరి.

(1) అల్లాహ్ యే వాస్తవ ఆరాధ్యుడు, సర్వ ఆరాధనలకు ఏకైక అర్హుడు అని నమ్మడం. ఎందుకనగా మానవుల సృష్టికర్త, వారికి మేలు చేయువాడు, వారికి ఆహారం నొసంగువాడు, వారి రహస్య బహిరంగ విషయాలన్నీ తెలిసినవాడు, పుణ్యాత్ములకు సత్ఫలితం మరియు పాపాత్ములను శిక్షించు శక్తిగలవాడు ఆయన మాత్రమే.

అందుకే ఆరాధనలోని ప్రతి ఒక్క రకంలో అల్లాహ్ ను అద్వితీయునిగా నమ్మడం తప్పనిసరి. అంతే కాదు ప్రతి ఆరాధన అల్లాహ్ యొక్క సంపూర్ణ ప్రేమ, భయం, ఆశ, వినయ వినమ్రతతో చేయాలి. ఈ గొప్ప, ముఖ్య విషయమే బోధిస్తూ ఖుర్ఆన్ లోని అధిక శాతం అవతరించింది. చదవండి అల్లాహ్ ఆదేశాలు: **నువ్వు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు - ధర్మాన్ని ఆయనకు మాత్రమే ప్రత్యేకిస్తూ! జాగ్రత్త! నిష్కల్మషమైన ఆరాధన మాత్రమే అల్లాహ్‌కు చెందుతుంది.** (**జుమర్ 39: 2,3**). **నీ ప్రభువు స్పష్టంగా ఆజ్ఞాపించాడు: మీరు ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకూడదు.** (**ఇస్రా 17:23**). **కాబట్టి మీరు మీ ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకుని ఆయన్నే వేడుకుంటూ ఉండండి - అవిశ్వాసులకు అది ఎంతగా సహించరానిదైనా సరే!** (**గాఫిర్ 40:14**).

2- అల్లాహ్ పై విశ్వాసములో మరొకటి ఆయన తన దాసులపై విధిగా నిర్ణయించిన ఐదు ఇస్లాం మూల స్తంభాలను విశ్వసించుట. అవి: (1) అల్లాహ్ మాత్రమే వాస్తవ ఆరాధ్యుడు మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ యొక్క ప్రవక్త అని సాక్ష్యమిచ్చుట. (2) నమాజు స్థాపించుట. (3) జకాత్ (విధి దానం) చెల్లించుట. (4) రమజాను మాసములో రోజా (ఉపవాసము) ఉండుట. (5) మక్కా యాత్ర చేయు శక్తి గలవారు హజ్ చేయుట. వీటితో పాటు ఇస్లాం ధర్మం యొక్క ఇతర విధులను కూడా నమ్మాలి, ఆచరించాలి.

3- అల్లాహ్ పై విశ్వాసంలో మరొకటి అల్లాహ్ యే సర్వలోకాల సృష్టికర్త, తనిష్టానుసారం తన శక్తి మరియు జ్ఞానముతో సర్వ కార్యాలు నిర్వహించువాడు. ఇహపరలోకాల అధికారి. ఆయనే సర్వలోకాల పోషకుడు. ఆయన తప్ప మరెవ్వడు సృష్టికర్తనూ లేడు. పోషకుడునూ లేడు. ఆయన తన దాసులకు సన్మార్గం చూపుటకు, వారిని వారి ఇహపరాల సాఫల్యం వైపునకు పిలుచుటకు ప్రవక్తలను పంపి, గ్రంథాలను అవతరింపజేశాడు. ఆయన పరమ పవిత్రుడు, అద్వితీయుడు, ఆయనకు సాటి ఎవ్వరూ లేరు: **{ప్రతి వస్తువును సృష్టించినవాడు అల్లాహ్ యే. ప్రతి వస్తువునకూ సంరక్షకుడు కూడా ఆయనే}**. (**సూరె జుమర్ 39: 62**).

4- ఆయన పై విశ్వాసములో మరొకటిః దివ్య ఖుర్ఆనులో మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హదీసుల్లో అల్లాహ్ పవిత్ర నామములు, ఉత్తమ గుణాలు ఏ రీతిలో తెలుపబడ్డాయో అదే రీతిలో ఏ మాత్రం 'తహ్ రీఫ్', 'తత్ తీల్', 'తక్‌యీఫ్', 'తమ్‌సీల్'① లేకుండా విశ్వసించాలి. ఆ పవిత్ర నామముల భావము ద్వారా తెలిసిన గుణములను మానవుల గుణాలతో పోల్చకుండా విశ్వసించాలి. సూర షూరా 42:11లో చదవండి: **{ఆయనను పోలిన వస్తువు సృష్టిలో ఏదీ లేదు. ఆయన అన్నీ వినేవాడూ, అన్నీ చూసేవాడూను}**.

① **'తహ్ రీఫ్'** అంటేః ఏ ఆధారము లేకుండా నామగుణాల భావాన్ని మార్చుట. తారుమారు చేయుట.
**'తత్ తీల్'** అంటేః అల్లాహ్ గుణనామాలన్నిటిని లేదా కొన్నిటిని తిరస్కరించుట. అల్లాహ్ ను నిరాకారునిగా భావించుట.
**'తక్ యీఫ్'** అంటేః అల్లాహ్ గుణాలను మాట, ఊహ ద్వారా ఏదైనా ఒక రూపం ఇచ్చే ప్రయత్నం చేయుట.
**'తమ్ సీల్'** అంటేః అల్లాహ్ గుణాలను సృష్టి గుణాలతో పోల్చుట. లేదా సృష్టి గుణాల మాదిరిగా ఉంటాయని విశ్వసించుట.